

ప్రజాశక్తి
శనివారం 6 జనవరి 2024
5
పార్వతీపురం మన్యం



డిప్యూటీ సిఎంకు ఎపిఎస్ఇజిసి సభ్యుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

కొత్తగా నియామకమైన ఎపి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ కౌన్సిల్ సభ్యునిగా అల్లు రాహుల్ నాయుడున నియమించిన సందర్భంగా మాడుగులలో ఉప ముఖ్య మంత్రి బూడి ముత్యాల నాయుడ్ని మర్యాదపురకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. తనపై నమ్మకం పెట్టుకుని చక్కని అవకాశాన్ని కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఆయతో పాటు మంత్రిని కలిసిన వారిలో తోటి కౌన్సిల్ సభ్యులు బూరి బాబు, ముక్కమల్ల పుల్లరెడ్డి, లంకిరెడ్డి మనోహర్‌రెడ్డి, టి.లక్ష్మి నర్సింహులు ఉన్నారు.




ముత్యాలునాయుడికి బొకే అందజేస్తున్న రాహుల్

పరిహారం చెల్లింపునకు మీనమేషాలు

ఆందోళనలో రైతులు

అసలే అరకొర లెక్కలు... ఆపై నష్టపరిహారం చెల్లింపునకు మీనమేషాలు. దీంతో మిచౌంగ్ తుపాను కారణంగా పంటనష్టపోయిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట ఇంటికి చేరితో ఈపాటికే నలగురిలా ధాన్యం డబ్బు చేతికి అందేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తడిసిన వరిచేను ఎత్తుతున్న రైతు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో లక్షా 66వేల ఎకరాల్లో సాగైంది. మిచౌంగ్ తుపాను గత నెలలో నాలుగు రోజులు పాటు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. వేలాది ఎకరాల్లో వరి నీట మునిగిపోయినప్పటికీ నష్టగణనలో వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకోలేదు. కేవలం నేలకు ఒరిగిపోవడం లేదా మునిగిపోవడం వంటివాటినే ప్రామాణికంగా తీసుకున్నారు. దీంతో, కేవలం 667 ఎకరాల్లో 1059 మంది రైతులు మాత్రమే నష్టపోయినట్టు అధికారులు గుర్తించారు. వీరికి రూ.50.62లక్షలు ప్రభుత్వం నుంచి అందాల్సివుంది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు కలిపి రూ.70లక్షల మేర నష్టపరిహారం అందాల్సివుందని, త్వరలోనే చెల్లిస్తామని వారం రోజుల క్రితం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పిన విషయం విధితమే. పండగ దగ్గర పడుతున్నా పరిహారం చెల్లించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుపాను నష్టం వల్ల అందరిలా సంక్రాంతి పండగ చేసుకునే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు. పంటనష్టం వాటిల్లిన మండలాల్లో సాలూరు, పాచిపెంట, సీతానగరం, పార్వతీపురం, జియ్యమ్మవలస, తదితర మండలాల్లో పంటనష్టం వాటిల్లింది. ఇతర మండలాల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో, చేతికి అందొచ్చిన పంట వర్షార్పణ అయిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పరిహారమైన వస్తుందని ఎదురు చూస్తున్న వీరికి సంక్రాంతికి నిరాశే మిగలనుంది.

లక్ష్య ఛేదనకు 'అభిలాష' : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యార్థులు, నిరుద్యోగులు తమ ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు అభిలాష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం తన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన అభిలాష కార్యక్రమం గూర్చి వివరించారు. జిల్లా 53 శాతం అక్షరాస్యతతో బాగా వెనుకబడి ఉందని, అక్షరాస్యత పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఇందుకు నీతి అయోగ్ నుంచి ప్రత్యేక నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో 200 సచివాలయాల్లో విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షలకు జనరల్ నాలెడ్జ్, సబ్జెట్ పుస్తకాలతో లైబ్రరీలు ఐటిడిఎ ద్వారా ప్రారంభించనున్నట్లు తెలిపారు. జెఇఇ, నీట్, ఇంజనీరింగు ప్రవేశ పరీక్షలకు హాజరుకానునన్న విద్యార్థులకు, యుపిపిఎస్సి, ఎపిపిఎస్సి, రక్షణ దళాలలు, ఎస్ఎస్సి పోటీ పరీక్షలకు హాజరయ్యే ఉద్యోగార్థులకు అవసరమైన పుస్తకాలు ఈ లైబ్రరీలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రతి లైబ్రరీలో 66 పుస్తకాలు సెట్లు రెండు ఉంటాయని విద్యార్థులు వారి పేరు, ఫోన్ నెంబరు, ఆధార్ నెంబరు తెలియజేసి ఈ అభిలాష కార్యక్రమాన్ని ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. ప్రస్తుతం 97 సచివాలయాల్లో ఈ అభిలాష కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, ఇందుకోసం రూ. 90లక్షలతో 12804 పుస్తకాలు కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ లైబ్రరీకి వెల్ఫేర్ అసిస్టెంటును బాధ్యులుగా నియమిస్తున్నామన్నారు. జిల్లాలో గల విద్యార్థులంతా అభిలాష కార్యక్రమం వినియోగించుకొనేందుకు వాలంటీరు ద్వారా గ్రామ సచివాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. తద్వారా విద్యార్థులు అధికంగా గల చోట్ల అవసరమైన అదనపు సౌకర్యాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. పుస్తకాలు పంపిణీకి ప్రత్యేక వెబ్ సైట్ ద్వారా నియంత్రించడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అధికారి సి. విష్ణుచరణ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో లైబ్రరీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఎంపిడిఒ, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ అసిస్టెంట్స్ మరియు ఎడ్యుకేషన

అనంతరం అభిలాష, ఆడుదాం ఆంధ్ర, ఆరోగ్య సురక్ష-2, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పిఎంజన్‌మాన్ సర్వే కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టరు మాట్లాడుతూ అవగాహన, అవకాశం, ఆర్థిక స్తోమతలేని కారణంగా విద్యార్థులు లక్ష్యాలను సాధించలేక పోతున్నారని, అటువంటి విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపయోగపడేలా విద్య, ఉద్యోగాల సాధనలో వారిని ప్రోత్సహించే లక్ష్యంతో అభిలాష కార్యక్రమాన్ని రూపొందించినట్టు తెలిపారు. దీన్ని విజయవంతం చేయాలని సూచించారు. పుస్తకాలను పంపిణీ కొరకు రూపొందిస్తున్నయాప్ వినియోగించుకొని పంపిణీ చేయాలని తెలిపారు. పుస్తకాలు పాడుచేయకుండా, ఒక్కరి దగ్గరే ఉండిపోకుండా చర్యలుతీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం త్వరలోనే ప్రారంభమౌతుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డులకు ఇ కెవైసీ పూర్తిచేసి పంపిణీ చేయాలని, రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మొదటి విడత వలే విజయవంతం చేయాలని, ఆరోగ్యశిబిరానికి వచ్చే వారు గతంలో వైద్య చేయించుకున్న రిపోర్టులను తప్పని సరిగా తీసువచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పి ఎం జన్ మాన్ సర్వే రేపటిలోగా పూర్తిచేయాలని తెలిపారు. ఆడుదాం ఆంధ్ర పోటీలు రేపటితో సచివాలయాల స్థాయిలో పూర్తవుతున్నందున, మండల స్థాయి టీంలను తయారు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు, డ్వామా పిడి కె.రామచంద్రరావు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

777 మందికి రూ.1.16 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి - పార్వతీపురం

అర్హులైవుండి వివిధ కారణాల వల్ల సంక్షేమ పథకాల వర్తించని జిల్లాలోని 777మంది లబ్ధిదారులకు రూ.కోటీ 16లక్షలు వారి ఖాతాలకు జమైనట్టు కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. నవరత్నాలు ద్వైవార్షిక నగదు జమ కార్యక్రమాన్ని శుక్రవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి బటన్ నొక్కి అర్హులైన లబ్దిదారుల ఖాతాలను నేరుగా నగదును జమ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అర్హులై ఉండి కొన్ని సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందని 777 మంది లబ్ధిదారులకు రూ.కోటీ 16లక్షల16వేల 682 నగదు లబ్ధి చేకూరిందన్నారు. ఇందులో అమ్మ వడి పథకం కింద 390 మంది లబ్ధిదారులకు రూ.55లక్షల 96వేల 682, జగనన్న చేదోడు కింద 304 మందికి రూ.30లక్షల 40వేలు, వై ఎస్ ఆర్ కల్యాణమస్తు కింద 41 మందికి రూ.23 లక్షల 75వేలు, వైఎస్ఆర్ వాహన మిత్ర కింద 22 మందికి రూ.3లక్షల 5వేలు, వైఎస్ఆర్ ఇబిసి నేస్తం కింద 19 మందికి రూ.2లక్షల 85 వేలు, వైఎస్ఆర్ కాపు నేస్తం కింద ఒకరికి 10 వేల రూపాయల నగదు లబ్ధి పొందారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, డ్వామా పీడీ కె.రామ చంద్ర రావు, తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌టిల తొలగింపు సరికాదు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలోని కెజిబివిలో పనిచేయుచున్న 64 మంది సిఆర్‌టిలను తొలగించడం సరికాదని పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాలేటి తవిటి నాయుడు, కాగాన విజయ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు భోగి రవికుమార్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఎస్‌పిడి నిర్ణయం తొందర పాటు చర్య అని తెలిపారు. 16, 17 ఏళ్ల నుంచి పని చేస్తున్న సిఆర్‌టిలను వారి హక్కుల కోసం సమ్మె చేయడం నేరం కాదని,వారి సమస్యలను ప్రభుత్వంతో చెప్పి పరిష్కరించాలే తప్ప ఇలా కక్ష సాధింపు చర్యలుగా చేయడం సరికాదని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారుల ద్వారా సిఆర్‌టిలను విధుల నుంచి తొలగిస్తూ ఇస్తున్న ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

76 ఏళ్లుగా డోలి మోతేనా?

- ప్రకటనలే తప్ప అభివృద్ధి శూన్యం
- 8న ఐటిడిఎ ఇంజినీరింగ్ కార్యాలయం ఎదుట ధర్నా
- పోస్టర్ ఆవిష్కరణలో గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ల గడిచినా గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో కొండ శిఖర గ్రామాలకు నేటికీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులకు డోలి కష్టాలు తప్పడం లేదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తక్షణమే గిరిజన ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఈనెల 8న ఐటిడిఎ ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో గోడ పత్రికలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు, అధికారులు గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ప్రకటనలు చేస్తున్న ఆచరణలో మాత్రం ఎక్కడా కానరావడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని చెబుతున్నారని, అయితే కొండల మీద గ్రామాలకు ఒక రోడ్డు అయినా వేశారా అని ప్రశ్నించారు. దేరువాడ నుండి వనకాబడి, దేరువాడ నుండి వండిడి, జర్న నుండి దిగువ చోరుపల్లి, బబ్బిడి నుండి ఎగువ చోరుపల్లి, నోంద్రుకోన నుండి శంభు గూడ, కుశబడి నుండి బబ్బిడి, గండపాక నుండి గుల్లలంక, కిత్త లంబ గ్రామాలకు నేటికీ రోడ్డు సౌకర్యం లేదన్నారు. దీంతో గర్భిణీలు, వృద్ధులు, గిరిజనులకు అనారోగ్యం వాటిల్లితే దుడ్డుఖల్లు రేగిడి, కురుపాం ప్రభుత్వ ఆసుపత్రులకు డోలి సాయంతో తీసుకు వస్తున్న సందర్భాలు ఇప్పటికీ దర్శనం ఇస్తున్నాయంటే అందుకు పాలకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని విమర్శించారు. గిరి శిఖర గ్రామాల రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించడం లేదన్నారు. మైదాన ప్రాంతంలో రోడ్డు పక్కన ఉన్న ఒక కిలోమీటరు, రెండు కిలోమీటర్లు దూరం వరకు ఉన్న గ్రావెల్ రోడ్లను నిర్మించి అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్నారని విమర్శించారు. తాడికొండ పైన , పులి పుట్టి గ్రామానికి గిరిజనులకు సొంతంగానే వేలాది రూపాయల ఖర్చు పెట్టి రోడ్లు నిర్మించుకున్నారని తెలిపారు. రోడ్ల సమస్యలపై ఈనెల 8న భద్రగిరి ఐటిడిఎ డిఇ ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం కోశాధికారి మండంగి రమణ, నాయకులు బిడ్డిక శంకరరావు, పువ్వుల మోహన్ రావు, సన్యాసిరావు, అడిత్ ఉన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

9న జియమ్మ వలస ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జియ్యమ్మ వలస మండలంలోని గిరిజన గ్రామాలన్నింటికీ బిటి రోడ్లు వేయాలని ఈనెల 9న స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోరంగి సీతారాం తెలిపారు. శుక్రవారం ఆయన గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో సీతారాం మాట్లాడుతూ బిల్లమానుగూడ నుండి వనజ గ్రామానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరానున్నా ఇంతవరకు రోడ్డు సౌకర్యం లేదన్నారు. ఎంతమంది నాయకులకు ఓట్లు వేసినా బిల్లమానుగూడకు రోడ్డు మంజూరు చేయలేదన్నారు. మండల కేంద్రానికి వెళ్లాలన్నా, నిత్యవసర సరుకులు, రేషన్ బియ్యం, అటవీ ఉత్పత్తులు విక్రయించాలన్నా కాలినడక తీసుకువెళ్లాలని అన్నారు. అభివృద్ధి అంటే ఇదేనానని అన్నారు. ఇప్పటికైనా బీటీ రోడ్డు మంజూరు చేసి వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ బిళ్లమానుగూడలో గిరిజనులతో నిరసన తెలిపారు. అలాగే మండలంలోని ద్రాక్షణి, చాపరాయి గూడ , బాపన గూడ, ఆర్నాడ, చినతోలుమంద, అర్నాడవలస, తుమ్మిగూడ, దంగభద్రవలస, చిలకల వానివలస, పసుపువాని వలస గిరిజన గ్రామాలకు సరైన రహదారి మార్గాల్లేవన్నారు. ఈ గిరిజన గ్రామాలంటికీ వెంటనే బిటి రోడ్లు మంజూరు చేసి నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న జియ్యమ్మవలస మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బుతాల మోహన్ రావు, గిరిజనులు పాల్గొన్నారు.

కొత్తపల్లి గీత ఎస్‌టి కాదు

రాష్ట్ర పరిశీలక కమిటీ ఉత్తర్వులు

ప్రజాశక్తి - సాలూరు

మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఎస్టీ కాదని రాష్ట్ర ప్రభుత్వ కులవివాదాల కమిటీ నిర్ణయించింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తపల్లి గీత అలియాస్ గ్లాడియస్ ఎస్టీ యేనని గతంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఆమె సోదరుడు వివేకానంద కుమార్ ఎస్టీ కాదని అదే జిల్లాకలెక్టర్ అంతకు ముందు ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇ.ఆంజనేయులు , న్యాయ సలహాదారు రేగు మహేశ్వరరావు ఆమె ఎస్టీ కాదని రాష్ట్ర ప్రభుత్వ కమిటీకి ఫిర్యాదు చేశారు. 2016 నుంచి రాష్ట్ర ప్రభుత్వం వద్ద గీత కులవివాదంపై విచారణ పెండింగ్‌లో ఉండిపోయింది. దీనిపై న్యాయవాది రేగు మహేశ్వరరావు గత ఏడాది ఆగస్టు లో హైకోర్టులో కేసు వేశారు. గీత కులవివాదంపై విచారణ నాలుగు నెలల్లో తేల్చాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు ఆమె కులవివాదంపై రాష్ట్ర స్థాయి కమిటీ విచారణ చేపట్టిన తీర్పును రిజర్వ్ చేసింది. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర ఆధ్వర్యాన ఏర్పడిన కమిటీ తీర్పు మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. గీత ఎస్టీ కాదని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేశారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

గడువులోగా సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - పాచిపెంట

గడువులోగా పంపిణీ చేయాలని ఎండియు వాహనం నిర్వాహకులకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ఆదేశించారు. పాచిపెంటలో శుక్రవారం ఎండియు వాహనం వద్ద సరుకుల పంపిణీని పరిశీలించారు. అనంతరం సకాలంలో సరుకులు అందుతున్నాయా లేదని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో ఎన్ని కార్డులున్నాయి, సరుకుల పంపిణీకి ఎన్ని రోజులు పడుతుందని వాహనం నిర్వాకుడ్ని అడిగారు. గ్రామంలో 1900 కార్డులున్నాయని సగటున రోజుకు 150 కార్డులకు సరుకులు పంపిణీ చేస్తున్నట్లు నివేదించారు. అలాగే ఈనెల జీతం రూ.3వేలు మాత్రమే కిట్టిందని, ఇదివరకు వాహనం రుణం ప్రభుత్వమే చెల్లించేదని, ఈనెల తమ వద్ద నుంచి వసూలు చేశారని వాపోయారు. అనంతరం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 121 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఆయన వెంట తహశీల్దార్ ఎం.రాజశేఖర్, ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.



కొమరాడలో సిఎం జగన్ చిత్ర పటం వద్ద భజన చేస్తున్న అంగన్‌వాడీలు

జగనన్నా... నీకు శతకోటి వందనాలు

- సిఎం చిత్రపటం వద్ద భజన
- ఉరితాళ్లతో అంగన్‌వాడీల నిరసన
- 25వ రోజుకు నిరవధిక సమ్మె

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు తలపెట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 25రోజులైంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వివిధ రూపాల్లో వినూత్నరీతుల్లో నిరసన తెలిపారు. కొమరాడలో సిఎం చిత్రపటం వద్ద భజన చేసి ర్యాలీ చేయగా, సాలూరులో ఉరితాళ్లతో గుమ్మలక్ష్మీపురం గడ్డి తింటూ, పార్వతీపురంలో మోకాళ్లపై నిల్చొని, ఇలా అన్ని చోట్లా అంగన్‌వాడీలు వివిధ రూపాల్లో తమ నిరసనను తెలిపారు.

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పార్వతీపురం ప్రాజెక్టు నాయకులు మర్రాపు అలివేలు, సాలూరు గౌరీమణి నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ సమ్మెకు సిఐటియు నాయకులు బొత్స లక్ష్మి, టిడిపి మాజీ నాయకులు గర్భాపు ఉదయభాను మద్దతు తెలిపారు. ప్రభుత్వం తమ పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా కార్యకర్తలు మోకాళ్లపై నిల్చుని నినాదాలు చేస్తూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు వి.శాంతి, కె.రాజేశ్వరి, ఎం.గౌరి, వి.సునీత, అధిక సంఖ్యలో వివిధ కేంద్రాల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటం వద్ద భజన చేస్తూ నిరసన

కొమరాడ : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటం వద్ద భజన చేస్తూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. అనంతరం సిఎం చిత్రపటం తలపై పెట్టుకొని అంగన్వాడీలు రహదారిపై ర్యాలీ చేస్తున్న నిరసన తెలిపారు. కార్యక్రమంలో కొమరాడ ప్రాజెక్ట్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు సిరికి అనురాధ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ సెక్టార్ నాయకులు బి.అలివేలుమంగ, జ్యోతి, మల్లేశ్వరమ్మ, పద్మ, జయమ్మ, లలిత, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉరితాళ్లతో నిరసన

సాలూరు: అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన కార్యకర్తలు, హెల్పర్లు నిరసన శిబిరం వద్ద ఉరితాళ్లను మెడకు బిగించుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు బి.రాధ, ఎ.నారాయణమ్మ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు ఆమోదించకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని చెప్పారు. గతంలో సిఎం జగన్ ఇచ్చిన హామీ లనే అమలు చేయాలని కోరుతుంటే ప్రభుత్వం కవ్వింపు చర్యలకు దిగుతోందని చెప్పారు.వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల వరలక్ష్మి తిరుపతమ్మ పార్వతి శశికళ పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక ఐటిడిఎ ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరింది. సమ్మె శిబిరంలో కోతాం అంగన్వాడీ హెల్పర్ ఎస్.శిరీష వడదెబ్బకు గురైంది. పాలకులు అంగన్వాడీలను వేధించడం అనాగరిక చర్యలా వుందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు అమలుకై దృష్టి పెట్టాల్సింది పోయి బెదిరింపులకు పాల్పడడం మహిళా ఉద్యోగులను అవమానపర్చడమే అవుతుందన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శమి, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు సురేష్,ఎం.కాంతారావు కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గుమ్మలక్ష్మీపురంలో అంగన్వాడీలు 25వ రోజు సమ్మెలో భాగంగా గడ్డి తిని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సత్యవతి, కస్తూరి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచుకుంటే గడ్డి తిని బ్రతకాలా అంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ, పి. మోహన్ రావు, సన్యాసిరావు, శంకర్ రావు ఉన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్వాడీలు చేపట్టిన నిరసన కొనసాగింది. సమ్మెలో శ్రామిక మహిళా సంఘం నాయకులు రామలక్ష్మి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎం.సత్యవతి, యశోద రెడ్డి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : అంగన్వాడీల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరాడుతామని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళ కుమారి అన్నారు. సమ్మె శిబిరంలో వినూత్నంగా పలకలపై అంగన్వాడీల సమస్యలను రాసి, వాటిని పరిష్కరించాలంటూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు నాయకులు జె.సరోజ, కురుపాం, జియ్యమ్మవలస మండలాల అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు.



సీతంపేటలో సమ్మె శిబిరం వద్ద స్పృహ కోల్పోయిన హెల్పర్ శిరీష

పాలకొండ : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పాలకొండ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా, కోలాటం తదితర రూపాల్లో నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమప్రభ, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడారు. టిడిపి పార్లమెంటరీ నాయకులు కర్నేన అప్పలనాయుడు అంగన్వాడీ శిబిరం దగ్గరకు వచ్చి మద్దతు తెలిపారు. ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు జి.జెస్సీబాయి, ప్రతినిధులు జి.శారద, ఆర్.భవాని, ఎం.శ్యామల, శ్రీదేవి, సుగుణ, లలిత, నిర్మల, గంగమ్మ, కుమారి తదితరులు కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

గరుగుబిల్లి: మండలంలో అంగన్వాడీలు సమ్మె కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు మర్రాపు సావిత్రి, కాత్సాయిని, కృష్ణవేణి, టి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం : గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



సాలూరు : మెడకు ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజా సంక్షేమానికే పథకాలు : రాజన్నదొర

ప్రజాశక్తి - మక్కువ

ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతుందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలో వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛను రూ. 2750 నుండి ప్రభుత్వం రూ.3 వేలకు పెంచిందన్నారు. ఆయన అన్నారు. అవ్వాతాతలకు, మహిళలకు ఈ పథకం ఎంత చేయూతనిస్తుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి మద్దిల పారమ్మ, జెడ్పిటిసి మావుడి శ్రీనివాసునాయుడు, వైసిపి నాయకులు మావుడి రంగునాయుడు, దండి శ్రీనివాసరావు, తహశీల్దార్, ఎంపిడిఒ, ఎపిఒ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పెంచిన పింఛను మొత్తాలను లబ్ధిదారులకు డిప్యూటీ సిఎం రాజన్నదొర పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరి వెంకటరమణ, పి.నన్నేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ ఎం.అప్పారావు, మున్సిపల్ కమిషనర్ జయరాం పాల్గొన్నారు.


పాలకొండ : స్థానిక కోటదుర్గ ఆలయ ఆవరణలో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ విక్రాంత్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు, కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, బాసురు కాంతారావు, కడగల రమణ, కొంచాడ అరుణ్, తూముల లక్ష్మణ, కిల్లారి మోహన్, నీలాపు శ్రీను, విజయ కుమార్, కమిషనర్ సర్వేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సీతానగరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్ఆర్ పింఛను పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే ఎ.జోగారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వం పింఛను అందజేస్తుందన్నారని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, జడ్పిటిసి ఎం.బాబ్జీ, ఎంపిడిఒ ఎంఎల్ఎస్ఎన్ ప్రసాద్, మండల వైసిపి అధ్యక్షులు బి.చిట్టిరాజు, ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు, మండల కార్యదర్శి బి.సూర్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు బి.కుసుమ సూర్యనారాయణ, సురగాల గౌరీకిరణ్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలోని కస్పా వీధిలో సచివాలయ కన్వీనర్ దూషి జానకమ్మ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తున్నారని ఇందులో భాగంగా రూ.3వేలుకు పింఛను పెంచినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వాలంటీర్లు, పింఛనుదార్లు పాల్గొన్నారు.



మక్కువలో లబ్ధిదారునికి పింఛను అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర



ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతిని అందజేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

సమస్యలపై ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని ఎపి గిరిజన సంక్షేమ గురుకులంలో తమ సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావుకు వినతిని అందజేశారు. మినీ గురుకులాలు ప్రారంభం నుంచి పనిచేస్తున్న తమకు జీతాలు పెరగలేదని తక్కువ జీతాలతో జీవనం కొనసాగించడం ఇబ్బందిగా ఉందని, మినిమం టైం స్కేల్ విధానం వర్తింపజేసేలా చూడాలని చైర్మన్‌ను కోరారు. ఈ సందర్భంగా ఎస్‌టి కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ మినీ గురుకులం కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.



పెట్రోలు బంక్ పనులను అడిగి తెలుసుకుంటున్న పిఒ విష్ణుచరణ్

పెట్రోల్ బంక్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల సమీపంలో నిర్మాణం జరుగుతున్న ఐటిడిఎ పెట్రోల్ బంక్ పనులను పిఒ సి.విష్ణు చరణ్ శుక్రవారం పరిశీలించారు. పనుల్లో ఎక్కడా కూడా నాణ్యతా లోపాల్లేకుండా తరితగతిగా పనులు పూర్తిచేసి పెట్రోల్ బంక్ ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిసిసి డివిజనల్ మేనేజర్ మహేంద్ర కుమార్, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

బూత్ ఇన్‌ఛార్జులకు శిక్షణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమానికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని బూత్ ఇన్ ఛార్జిలకు కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి కోరారు. గుమ్మలక్ష్మీపురంలో యూనిట్ నెంబర్ 13లో బూత్ ఇన్‌ఛార్జిలకు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో టిడిపి బలోపేతానికి బూత్ ఇన్‌ఛార్జిలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌ఛార్జిలు కామేశ్వరరావు, రామారావు, గుంజన్న, జయంతి, కొండలరావు, మండల ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

17వ రోజుకు సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె శుక్రవారం 17వ రోజు విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలో పెద్దఎత్తున ఉద్యోగులు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్పీడీ కార్యాలయం ముందు శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్లిన తమ నాయకులను అరెస్టు చేయడం దారుణమని, అలాగే జిల్లాకు చెందిన 65మంది సిఆర్‌టిలను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. తాము అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ పట్టీపనట్టు వ్యవహరించడం సహేతుకంగాలేదని అన్నారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులు విద్యాశాఖలో విలీనం చేయాలన్న తమ డిమాండ్లను పరిశీలించి, హెచ్ఆర్ పాలసీ అమలు చేసేదాక సమ్మెను కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎం.ఈశ్వరరావు, కాంతారావు, భాను ప్రకాష్, బివి రమణ, భారతి తదితరులతో పాటు జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి వచ్చిన ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కోడిశలో ప్రచారం చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణ

కోడిశలో భవిష్యత్ గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కోడిశ పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో బాబు షూర్టీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్లేసి గెలిపించిన రాష్ట్ర ప్రజలకు సిఎం నమ్మకద్రోహం చేశారని విమర్శించారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపిని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సవరతోట మొఖలింగం, నిమ్మక నాగేశ్వరావు, కోడిశ సర్పంచ్ సవర గంగయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ నిమ్మక చంద్రశేఖర్, బిసి సెల్ అధ్యక్షులు ఆర్.రంగనాథం, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, ఐటిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇమరక పవన్, భవిష్యత్తు గ్యారెంటీ ప్రచారకర్త తోయిక సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

పివిటిజిలు అర్హత కార్డులు పొందాలి

ప్రజాశక్తి - కురుపాం

పివిటిజి గ్రూపులకు చెందిన సవర, గదబ కులస్తులకు ప్రభుత్వం నుంచి వచ్చిన అన్ని అర్హత పథకాల కార్డులు పొందేలా అధికారులే చూడాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ అన్నారు. శుక్రవారం మండలంలో గుమ్మ సచివాలయం వద్ద జరిగిన ప్రధానమంత్రి జనహిత ఆదివాసి నాయ మహా అభియాన్ గ్రామసభకు పిఒ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పివిటిజి గ్రూపులకు చెందిన కులస్తులను గుర్తించి వారికి ఆధార్, రేషన్ కార్డు, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదో గుర్తించి అందని వారికి వెంటనే అన్ని అందేలా చూసేలా చేయడమే ప్రధానమంత్రి జనహిత ఆదివాస నాయ మహా అభియాన్ కార్యక్రమం ముఖ్యోద్దేశమని అన్నారు. అధికారులంతా సక్రమంగా గుర్తించి అన్ని పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.అప్పారావు, ఎపిఒ పి.బావాజీ, ఎపిఎం ఇవి కిషోర్, వివిధ శాఖల అధికారులు, స్థానిక సర్పంచ్ ఆరిక గోపాలరావు, పంచాయతీ కార్యదర్శి కె.విజయ్ కుమార్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు సత్కారం

గుమ్మలక్ష్మీపురం : జన్మభూమిని, కన్నతల్లిని మరువకుండా ఆ నానుడిని నిజం చేస్తూ ఇప్పటివరకు ఎన్నో కార్యక్రమాలకు సహకారం అందిస్తూ కష్టాల్లో భారం పంచుకుంటూ గ్రామానికి వెన్నెముకగా నిలుస్తున్న బుడంకాయల శ్రీనివాసరావుకు శుక్రవారం స్థానిక సచివాలయంలో ఘన సన్మానం జరిగింది. ఈ సమావేశానికి సర్పంచ్ బి.గౌరీశంకర్రావు అధ్యక్షత వహించగా, వైస్ ఎంపిపి ఎన్.శేఖర్ హాజరు కాగా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల అభినందనలు అందుకున్నారు. ఈ అభినందన కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కిషోర్, సచివాలయ కార్యదర్శి కిషోర్, విఆర్ఒ, దోస్త్ మేరా దోస్త్ అధ్యక్షులు ప్రమాణం వైశ్య సంఘం అధ్యక్షులు హరిప్రసాద్, హెల్పింగ్ హాండ్స్ కీలక సభ్యులు వినోద్ కుమార్, వైశ్య సంఘం సభ్యులు పాండురంగ, మధు, మన్మధ, కాపు సంఘ నాయకులు సూర్యం, సచివాలయ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సర్పంచ్ గౌరీ శంకర్రావు మాట్లాడుతూ గ్రామానికి వెన్నుముకగా నిలిచిన శ్రీమంతుడు శ్రీనివాసరావు ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించటం గొప్ప విషయమన్నారు. గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర శ్రీనివాసరావు సేవలు అని నిర్వచనీయమని ఆయన కొనియాడారు.

9న రైతు సంఘం ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

ధాన్యం కొనుగోళ్లలో రైతులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 9న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో ధర్నాకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వమే రైతుల వద్ద కొన్న ధాన్యాన్ని వాహనాల ద్వారా రవాణా చేయించి, ప్రతి కేజీ ధాన్యానికి గానూ 21.83 రూపాయలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం రవాణా ఏర్పాట్లు చేయకపోవడం వల్ల రైతులకు రవాణా ఇబ్బందిగా మారి మధ్యవర్తులను ఆశ్రయించాల్సి వస్తుందని అన్నారు. అలాగే మిల్లర్లు రైతుల నుంచి క్వింటాకు 5 కేజీలు ధాన్యం అదనంగా డిమాండ్ చేస్తున్నారని, ఇటువంటి అక్రమాలను నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు రెడ్డి సత్యనారాయణ, బోపర రెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల కోసం బారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ కార్యాలయం వద్ద ఇకెవైసి చేయించుకునేందుకు శుక్రవారం వినియోగదారులు క్యూకట్టారు. వినియోగదారులు ఆధార్ కార్డు, గ్యాస్ పుస్తకాలు పట్టుకొని కార్యాలయం వద్దకు రావాలని నిర్వాహకులు సమాచారం ఇవ్వడంతో మండలంలోని వినియోగదారులంతా కార్యాలయం వద్దకు చేరుకొని తమ వివరాలు పొందుపర్చుకుంటున్నారు.

పొర్లుదండాలతో వినూత్న నిరసన

11వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్, వాటర్ సెక్షన్ కార్మికుల సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెలో భాగంగా తమ సమస్యలు పరిష్కరించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆలోచించాలని దేవునికి మొక్కుకొని పనులు జరిగిన తర్వాత మొక్కులు తీర్చుకుంటామంటూ పొర్లు దండాలతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఆప్కాస్ విధాన కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, ఇంజనీరింగ్ వర్కర్లందరికీ హెల్త్ అలవెన్స్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, పారిశుధ్య కార్మికులు చీపురుపల్లి సింహాచలం, పడాల గాంధీ, మామిడి శివ, బంగారు రాజేష్, నాగవంశం మల్లేసు, బంగారు రవి, నిర్మల ఇప్పలమ్మ, తదితర కార్మికులు పాల్గొన్నారు.

పాలకొండ : ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పొర్లు దండాలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమ్మె శిబిరం వద్దకు మద్దతుగా టిడిపి పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, ప్రతినిధి బృందం అడపా బాబ్జీనాయుడు, అంపోలు శ్రీనివాసు సుంకరి, అనిల్ తదితరులు మాజీ కౌన్సిల్ ప్రతినిధులు మద్దతిస్తూ మాట్లాడారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన హామీలు మున్సిపల్ కార్మికులకు తక్షణమే అమలు చేయాలని, శనివారం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల ముట్టడి జరగబోతున్నదని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పడాల భాస్కరరావు, చింతల సంజీవి, పడాల వేణు, వై.హరిబాబు, టి.వెంకటరమణ, పి.సూరిబాబు, జి.నారాయణరావు, టి.ఈశ్వరకుమార్, పి.సాయి, ఎన్.రామారావు, రామకృష్ణ, సురేష్ తదితరులు నాయకత్వం వహించారు.

సాలూరు: మున్సిపల్ కార్మికుల సమ్మె 11రోజుకి చేరింది. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు పొర్లు దండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు మాట్లాడుతూ పట్టణాల్లో అపారిశుధ్యం తాండవిస్తోందని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని ,కనీస వేతనం రూ.26వేలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తీవ్రతరం చేస్తామని చెప్పారు. శనివారం నిర్వహించనున్న మున్సిపల్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు ఆమోదించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు పోలరాజు స్వప్న రవి పాల్గొన్నారు.



పార్వతీపురంలో పొర్లు దండాలు పెడుతున్న మున్సిపల్ కార్మికులు



సాలూరులో పొర్లు దండాలు పెడుతున్న మున్సిపల్ కార్మికులు

జెఎస్ శిబిరాలను వినియోగించుకోవాలి : ఎంపిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కె.దీనమయ్య కోరారు. స్థానిక సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్రావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం లాంటిదన్నారు. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి నుంచి వైద్యులు శేషగిరి, కోటేశ్వరరావు వచ్చి సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు, వైస్ సర్పంచ్ కిషోర్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కిషోర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు సచివాలయం పరిధిలోని బురద వెంకటాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంపిడిఒ జి.పైడితల్లి ఆధ్వర్యాన జరిగింది. ఈ వైద్య శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులు రోగులకు తనిఖీలు నిర్వహించడంతో పాటు మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సంతోష్ కుమార్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతల మల్లినాయుడు, వైద్య సిబ్బంది చింతాడ ఉదయకుమారి, సచి వాలయ సిబ్బంది గంట జనార్ధ నరావు, సీమల సాయికుమార్, పూడి మన్మధరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

భార్యను చిత్రహింసలు పెట్టి..వాటర్ ట్యాంకుపై నుంచి దూకి
ఉన్మాది ఆత్మహత్య



తీవ్రగాయాలతో గంగతల్లి

ప్రజాశక్తి-వేపాడ

భార్యను చిత్రహింసలకు గురిచేసి, ఆపై ఆత్మహత్యకు పాల్పడ్డాడో ఉన్మాది. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని బల్లంకి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బల్లంకి గ్రామానికి చెందిన చెలిబోని ఈశ్వరరావు (40) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ బాధ్యతను విస్మరించి, భార్య గంగతల్లి, కుమార్తెను హింసించడం అలవాటుగా చేసుకున్నాడు. తాగితే కుటుంబాన్ని ఎలా పోషించాలి? ఏదైనా పనికి వెళ్లాలని భార్య అడిగితే, ఆమెను కొట్టేవాడు. ఈ నేపథ్యంలో గంగతల్లి వల్లంపూడి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గురువారం ఈశ్వరరావును స్టేషన్‌కు పిలిపించి, ఇకపై సరిగా లేకుంటే చర్యలు తీసుకుంటామని మందలించి, పంపించేశారు. దీన్ని జీర్ణించుకోలేని ఈశ్వరరావు ఉన్మాదిగా మారాడు. అదేరోజు రాత్రి ఇంటి వద్ద కక్కిరి మట్టతో ఆమెపై దాడి చేశాడు. తీవ్రంగా గాయాలైన ఆమె కేకలు వేయడంతో కక్కిరి మట్టతో పీక కోసి, అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు ఆమెను విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. శుక్రవారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో ఈశ్వరరావు ట్యాంకుపై నుంచి దూకడంతో అక్కడికక్కడే మరణించాడు. శరీరమంతా తీవ్ర గాయాలు కావడంతో గంగతల్లి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఆమెకు సుమారు 60 కుట్లు పడ్డాయి. ఈశ్వరరావు తమ్ముడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బివి రమణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు.



మృతిచెందిన ఈశ్వరరావు

5.5 గంజాయి పట్టివేత

పాచిపెంట : ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న 5.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా నుంచి పి.కోనవలస చెక్‌పోస్టు మీదుగా కేరళకు చెందిన ముస్తఫ్, నిరీష గంజాయిని తరలిస్తుండగా చెక్‌పోస్ట్ వద్ద గురువారం రాత్రి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు

మహిళా ప్రిన్సిపల్‌ను నియమించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి గిరిజన గురుకుల పిటిజి బాలికల పాఠశాలకు రెగ్యులర్ మహిళా ప్రిన్సిపల్‌ను నియమించాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్లా సురేష్ కోరారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిడి రుక్మానందయ్య

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి

ఉపాధ్యాయుల శిక్షణలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

త్వరలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సామర్థ్యాలు, ఒకాబులరీల పెంపు కోసం ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయుడు కృషి చేయాలని గిరిజన సంక్షేమ సాధికారిక అధికారి ఎం.రుక్మాంగదయ్య తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక వైటిసిలో సబ్జెక్టు ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటి నుంచే 60 రోజుల ప్రణాళికలో భాగంగా సామర్థ్యాలను పెంపొందించి పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. ప్రతి సబ్జెక్టుపైనా అవగాహన మేరకు ముందుకు నడిపించేలా బోధించాలన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు సబ్జెక్టుపై అనుమానాలను నివృత్తి చేసి పరీక్షలకు సన్నద్ధం చేయాలని కోరారు. ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యాభివృద్ధికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ విద్యార్థికైనా పాఠ్యాంశాలలో సందేహాలు రాకుండా నివృత్తి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాల అయిన తర్వాత గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో స్టడీ అవర్స్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక తరగతులను బోధించాలన్నారు. ఆయన వెంట గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఎటి డబ్ల్యూఒ లు సురేష్ కుమార్, చంద్రబాబునాయుడు, జిఎంవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల సబ్జెక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు మెనూ అమలు చేయాలి

ప్రభుత్వ నిబంధనల మేరకు గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలలో మెనూ అమలు చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి ఎం.రుక్మాంగదయ్య తెలిపారు. భద్రగిరి ఎపి గిరిజన గురుకుల బాలికల (పిటిజి) పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులతో కలిసి భోజనం చేసి రుచి చూశారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టిక ఆహారాన్ని తినాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు పాఠశాలకు చేరుకొని డిడి కు పలు సూచనలు చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం కోసం హెల్త్ వాలంటీర్లను నియమించాలని, పాఠశాలల్లో వంట చేసేందుకు కుక్కులను, కమాటేలను నియమించాలని, అలాగే పబ్లిక్ పరీక్షలు రానున్న నేపథ్యంలో విద్యుత్తు సమస్య తలెత్తకుండా ఇన్వర్టర్లను అందజేయాలని కోరారు. ఆయా పాఠశాలలపై సక్రమంగా పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ యుగంధర్, గురుకుల కళాశాల ప్రిన్సిపల్ సత్యవతి, టిఆర్ఎఫ్ మన్యం జిల్లా అధ్యక్షులు ఇంటికొప్పుల రామకష్ణ తదితరులు ఉన్నారు.

ఆధునిక పంటలపై దృష్టిసారిస్తే అధిక లాభాలు

ప్రజాశక్తి - కురుపాం

రైతులు ఆధునిక పంటలపై దృష్టి సారిస్తే అధిక లాభాలు పొందవచ్చని అసోసియేట్ డైరక్టర్ అఫ్ రీసెర్చ్ (ఆర్ఎఆర్ ఎస్ చింతపల్లి) డాక్టర్ సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం శివన్నపేటలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాల నైరా విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన, రైతు సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆధునిక పంటలపై మక్కువ చూపి దృష్టి సారిస్తే అధిక ఆదాయాన్ని పొందుతారన్నారు. అలాగే రస్తాకుంటుబాయిలో గల కృషి విజ్ఞానకేంద్రంలోని వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తే మరింత దిగుబడులు పొందువచ్చని అన్నారు. అనంతరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు స్వయంగా తయారు చేసిన వ్యవసాయ ప్రదర్శనలు సందర్శించారు.ఈ కార్యక్రమంలో కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ పాత్రో, కెవికె శాస్త్రవేత్తలు, అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ వ్యవసాయ కళాశాల ఉపాధ్యాయులు డాక్టర్ చిన్నంనాయిడు, వ్యవసాయశాఖ ఎడిఎ నిర్మలజ్యోతి, స్థానిక ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, రైతులు మరియు వ్యవసాయ కళాశాల విదార్థులు పాల్గొన్నారు .



సదస్సులో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తం

గరుగుబిల్లి : పశువులకు సోకే గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, వెంటనే ఈ వ్యాధి నివారణ టీకాలను వేయించాలని ఎంపిపి ఉరిటి రామారావు రైతులకు సూచించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండల పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధిటీకాల కార్యక్రమం మరుపెంటలో ఎంపిపి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాలికుం టువ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే మార్గమన్నారు. గరుగుబిల్లి ఏరియా పశువైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ బి.గణపతిరావు మాట్లాడుతూ గాలికుంటువ్యాధి నివారణకు సంబంధించి పశు వులకు టీకాలు వేయడం ఎంతో ఉపయోగమన్నారు. మండల పశుసం వర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎస్.సురేష్ కుమార్ మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.శ్రీరాములు నాయుడు, ఎ.వెంకటి, పైడిరాజు, గణేష్, రైలు పాల్గొన్నారు.



టీకాల వేసే ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపిపి రామారావు